క్లుప్తంగా

ప్యాంటలూన్ మాల్ ప్రారంభం



నగరంపాలెం: స్థానిక చంద్రమౌళీ నగర్ ఏడో వీధి శివా సిటీ సెంటర్‌లో ఆదిత్య బిర్లా ఆధ్వర్యంలో నిర్మించిన ప్యాంటలూన్స్ మాల్‌ను శుక్రవారం శివా కన్స్ట్రక్షన్స్ అధినేత ఆళ్ల శివా రెడ్డి ప్రారంభించారు. మాల్‌లో మహిళలు, పురుషులు, చిన్నారులకు అవసరమైన అన్ని రకాల బ్రాండెడ్ దుస్తులు, వాచ్‌లు, పర్‌ఫ్యూమ్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రాజధాని ప్రాంతమైన గుంటూరు అనువుగా ఉందని పేర్కొన్నారు. అనేక సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

జాషువా పురస్కారానికి గురవమ్మ ఎంపిక



నగరంపాలెం: ఏపీ ప్రభుత్వం ప్రదానం చేయనున్న కవికోకిల జాషువా పురస్కారానికి గుంటూరు నగరానికి చెందిన ప్రజా గాయని కత్తి గురవమ్మ (లెనీనా) ఎంపికైంది. ఈ మేరకు భాషా సాంస్కృతిక శాఖ శనివారం ప్రకటించినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న విజయవాడ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరగనున్న జాషువా 130వ జయంతి సభలో పురస్కారం ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

తెలుగు జాతి, భాషను పరిరక్షించుకోవాలి



లక్ష్మీపురం:తెలుగు జాతి, భాష పరిరక్షణకు ప్రజలు మరో సంస్కరణ ఉద్యమానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ తెలిపారు. తెలుగు సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో ఆయన 130వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ కుల వివక్షత, మతతత్వం, స్త్రీల హక్కుల అణచివేత, శ్రమ దోపిడీ.. ఇలా అన్ని విషయాల్లోనూ జాషువా తన ధర్మాగ్రహాన్ని కవిత్వం ద్వారా వ్యక్తం చేశారని వివరించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని నేటి యుతరంలోకి తీసుకెళ్లటానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం, జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎ.కాళిదాసు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు ఎస్ భావన్నారాయణ పాల్గొన్నారు.

జొమాటో కార్మికుల సమ్మె విజయవంతం

లక్ష్మీపురం: జొమాటో కార్మికుల సమ్మె మొదటి రోజు శనివారం విజయవంతమైంది. కార్మికులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు బి. ముత్యాలరావు మాట్లాడుతూ జొమాటో యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తోందని తెలిపారు. యాజమాన్య ప్రతినిధులు మొండిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ కార్యదర్శి ఈ. క్రాంతి రణదేవ్ మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీసమైన ఆదాయం వచ్చేలాగా, కనీస వేతన చట్టాలు వర్తింప చేసేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.








వికాస్‌నగర్ సాయి మందిరంలో గాయత్రీదేవిగా.. | సిద్ధార్థనగర్ కనక మహాలక్ష్మీ మందిరంలోలలితా దేవిగా.. | బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో | మారుతీనగర్ కంచి కామకోటి పీఠంలో మహాకాళి దేవిగా | రెడ్ల బజార్ అమ్మవారి దేవస్థానంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా.. | విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో మహాకాళి దేవిగా..

అమ్మలగన్న అమ్మ..ఆది పరాశక్తీ నమస్తుతే !

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నగర పరిధిలోని దేవాలయాల్లో అమ్మవారు పలు అవతారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కుంకుమార్చన, లోక కల్యాణార్థం శక్తి హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు అమ్మవారి సహస్రనామ పూజలు చేపట్టారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. – నగరంపాలెం








చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానంలో శ్రీలలిత త్రిపురసుందరీదేవి | ఏటీ.అగ్రహారం శంకర గాయత్రి దత్తసాయి సత్యదేవ మందిరంలో | రవీంద్రనగర్ శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో | ఎస్‌విఎన్‌కాలనీ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భవానీ దేవి | మల్లికార్జునపేట శివాలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం | నాయుడుపేటలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం



లాలుపురంలో ఐయిగిరి నందిని రూపకాన్ని ప్రదర్శిస్తున్న నృత్య కారిణులు

డీఎస్సీ-2025 క్వాలిఫైడ్స్‌కు న్యాయం చేయాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 నియామకాలపై అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించి, క్వాలిఫైడ్స్ అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్ డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు మొదటి సంతకంగా చెప్పుకున్న డీఎస్సీ నిర్వహణలో అభ్యర్థులు అనేక అభ్యంతరాలను తెలిపినా పట్టించుకోకుండా, నియామక ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని తెలిపారు. ఇప్పటికే కొంత మంది అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారని, వాటిని పరిగణలోకి తీసుకోకుండా నియామకాలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఇమేజ్ కోసం కాకుండా అభ్యర్థులకు న్యాయం చేసే విధంగా జీవో 77 ప్రకారం రిజర్వేషన్ అమల్లో ఉన్న అభ్యంతరాలను పరిష్కరించాలని ఆయన కోరారు. కొంత మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా వారికి నియామక పత్రాలు ఇవ్వలేదని తెలిపారు. పీపీ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్.బుజ్జిబాబు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రశ్నల సరళి తప్పుల తడకగా ఉందని తెలిపారు. సిలబస్‌తో సంబంధం లేని అంశాలతో పాటు 24 ప్రశ్నలు తప్పుగా ఇచ్చిన ఫలితంగా అభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు. నియామకాలు చేపట్టిన తరువాత గ్రీవెన్స్ నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదని, సమస్యలపై తక్షణమే స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో శనివారం యూనియన్ నేత తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు,పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు పేస్లిప్పులో వచ్చేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కనీసం పీఆర్సీ కమిషన్ నియమించ లేదని, దీనిపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. కనీసం డీఏలు కూడా ఇవ్వకపోవడం దారుణమని ఖండించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ గురించి ఆలోచించాలని కోరారు. తెలంగాణలో రెండేళ్లుగా ఐఆర్ తీసుకుంటున్నారని తెలిపారు. పీఆర్సీ ఆలస్యంతో ప్రతి ఉద్యోగి సంవత్సరానికి లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు నష్టపోతున్నారని, మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైరేజన్ చేయాలని కోరారు. ఉద్యోగుల వైద్యానికి పనికి రాని హెల్త్ కార్డులు ఎందుకని ప్రశ్నించారు. ఎ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ , ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి వెంకట్రావు, రిటైర్డ్ డెప్యూటీ కలెక్టర్ షేక్ ఇస్మాయిల్, జిల్లా రిటైర్డ్ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ సంగీతరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ అవసరం

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య



మాట్లాడుతున్న రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చడంలో ప్రభుత్వం వెనుకబడుతోందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. లాడ్జి సెంటర్లోని ఆంధ్ర లూథరన్ (ఏఎల్) బీఈడీ కళాశాలలో శనివారం ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థి లావు రత్తయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ ఎంతో అవసరం అన్నారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్లాటినం జూబ్లీ పైలాన్ ప్రారంభించారు. మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ చర్చిల నిర్వహణలో సంస్కరణలు రావాలని, దీనివల్ల చర్చిలకు అనుబంధంగా ఉన్న విద్యాసంస్థలు మరింత అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాదాసు ఎస్తేరు సునీల, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ జస్టిస్ జోసఫ్ పి.ఎస్.ఎన్. జేసురత్న కుమార్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. పాల్ రత్నాకర్ పాల్గొన్నారు.

రోల్‌బాల్ చాంపియన్ కార్తికేయ



గుంటూరు ఎడ్యుకేషన్: రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 6వ సౌత్ జోన్ మినీ రోల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ ఉన్నత పాఠశాల 4వ తరగతి విద్యార్థి ఎస్. కార్తికేయ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తూ విజేతలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి.దుర్గాశ్యామ్, ఇన్‌చార్జ్‌లు టి.శ్రీదేవి, దిల్‌జహాన్, హరిప్రియలు కార్తికేయను అభినందించారు.

మెంటార్ సిటీగా గుంటూరు



ఎంఓయూ చేసుకుంటున్న మేయర్, కమిషనర్

నెహ్రూనగర్: మునిసిపాలిటీలను స్వచ్ఛ పట్టణాలుగా, స్వచ్ఛ షహర్ జోడీగా తీర్చిదిద్దడానికి మెంటార్ సిటీగా గుంటూరు నగరపాలక సంస్థను స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించడం గర్వకారణమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టేలా, తగిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం చేయడానికి స్వచ్ఛ షహర్ జోడీకి మెంటార్ సిటీగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించిందని పేర్కొన్నారు. అందులో భాగంగా పొదిలి, ఆత్మకూరు(కే), నందికొట్కూరు, బేతంచర్ల, నూజివీడు మునిసిపాలిటీలకు మెంటార్‌గా ఉండేందుకు శనివారం ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. రానున్న 100 రోజుల్లో సదరు మునిసిపాలిటీల్లో పారిశుద్ధ్యం మెరుగుదల చేయడానికి తగిన తోడ్పాటు, అవగాహనను జీఎంసీ నుంచి కలిగిస్తామని తెలిపారు.

మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం

నగరంపాలెం: స్థానిక బొంగరాల బీడు మహాప్రస్థానం అభివృద్ధికి ఏలూరి వెంకటేశ్వరావు, తిరుపతమ్మ, వెంకటరావు, సామ్రాజ్యంలు రూ.3 లక్షల చెక్కును శనివారం కమిటీ సభ్యులకు అందించారు. దివంగత ఏలూరి సుబ్బారాయుడు భార్య చెన్నమ్మ జ్ఞాపకార్థం అందించినట్లు దాతలు తెలిపారు.కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలగపూడి లక్ష్మణరావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, సభ్యులు కల్లూరి రమణయ్య, ఏలూరి నరసింహారావు, కూనల మాలకొండయ్య, నిమ్మగడ్డ అంకమ్మచౌదరి, జంగాలపల్లి పార్థసారధి పాల్గొన్నారు.

విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలి



నవదుర్గల వేషధారణలోని విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా సంస్కృతి, సంప్రదాయాల గురించి తప్పక తెలుసుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ఆర్. శివరామప్రసాద్ తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామప్రసాద్ మాట్లాడుతూ పండుగలు వారసత్వాన్ని, ఆధ్యాత్మిక విలువలను గుర్తు చేస్తాయని, యువతలో సాంస్కృతిక చైతన్యం పెంపొందిస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ సాంకేతిక విద్యతో పాటు సంస్కృతిని కాపాడుకోవడం, ఆచరించడం ప్రతి విద్యార్థి బాధ్యతని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల అలంకరణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు చక్రవర్తి, రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ కె.లలిత, దసరా వేడుకల కన్వీనర్ కళ్యాణి, చల్లా వైష్ణవి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో చిరు వ్యాపారులకు ఊతం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో చిరువ్యాపారులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పాత గుంటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ తమీం అన్సారియాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వస్తువును కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ గతంలో ఉన్న ధరలను, ప్రస్తుత ధరలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా ప్రజలకు ఎంత మేర ప్రతిఫలం చేకూరుతుందో వివరాలను స్థానిక అధికారులు తెలియజేయాలని చెప్పారు. దీనికి గాను ఒక ప్రత్యేకాధికారిని నోడల్ అధికారిగా నియమించి ప్రతి డిపార్ట్‌మెంట్ ద్వారా గ్రామస్థాయి వరకు ట్రైనింగ్ అందించి జీఎస్టీ గురించి పూర్తి అవగాహన కల్పించబోతున్నామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ , జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని), ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.